నేడు ప్రమాణస్వీకారం

ముషీరాబాద్: ముషీరాబాద్ ప్రసిద్ధిగాంచిన ముషీరాబాద్ మహంకాళి దేవాలయ కమిటీ చైర్మన్‌గా బి.నరేష్‌కుమార్ మంగళవారం ఉదయం 11 గంటలకు ప్రమాణస్వీకారం చేయనున్నారని దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్ తదితరులు హాజరవుతారన్నారు.

హుండీ కానుకల లెక్కింపు

చిక్కడపల్లి: వివేక్‌నగర్ స్వయంభూవుగా వెలసిన ఆంజనేయస్వామి దేవాలయంలో హుండీ కానుకల లెక్కింపు సోమవారం జరిగింది. ఆలయం పునర్ నిర్మాణ కమిటీ చైర్మన్ జానకి సుధాకర్, ఈవో మాచర్ల దేవనాథం, దేవాదాయ ధర్మాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సురేఖ్ పర్యవేక్షణలో లెక్కించారు. 38 రోజులకు రూ.2,01,624 ఆదాయం వచ్చిందన్నారు. దేవాలయంలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకులు బుగ్గాలక్ష్మీపతిశర్మ, కందాళ వెంకటాద్రి, సభ్యులు ఎన్.శ్యాంకుమార్, భక్తులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత

ముషీరాబాద్: భోలక్‌పూర్ డివిజన్ కవాడిగూడ తాళ్లబస్తీలో చేపట్టిన అక్రమ నిర్మాణాన్ని జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు సోమవారం కూల్చివేశారు. భవనం ముందు ఉన్న మెట్లు, అక్రమంగా ఏర్పాటు చేసిన షెడ్డును తొలగించారు. పోలీసులు బందోబస్తు మధ్య అక్రమ నిర్మాణాలను బుల్డోజర్‌తో కూల్చివేశారు.

ఆలయ కోనేరు వద్ద కూలిన గోడ



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: నగరంలో ప్రతిష్ఠాత్మకమైన చిక్కడపల్లిలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో కోనేరు దగ్గర ఉన్న పాత గోడ కూలింది. సోమవారం మహంకాళి జిల్లా బీజేపీ అధ్యక్షుడు గుండగోని భరత్‌గౌడ్ ఆధ్వర్యంలో పలువురు బీజేపీ నాయకులు పరిశీలించారు. స్థానికులకు ఇబ్బందులు కలగకుండా త్వరితగతిన పనులు చేపట్టాలని ఆలయ ఈఓ అన్నపూర్ణతో పాటు డిప్యూటీ కమిషనర్ రామానుజరెడ్డిని కోరారు. ఈ కార్యక్రమంలో రాంనగర్ డివిజన్ అధ్యక్షుడు గడ్డం సతీష్, నాయకులు పార్థసారధి, జైపాల్‌రెడ్డి, కాలకోట అరుణ్, కిరణ్, జక్క శ్రీను, ఉపేందర్, వీరయ్య, హర్ష తదితరులు ఉన్నారు.

అంబేడ్కర్ కాలేజీకి 3వ స్థానం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఉస్మానియా విశ్వవిద్యాలయం శారీరక విద్యా విభాగం నిర్వహించిన ఇంటర్ కాలేజ్ టోర్నమెంట్‌లో బాగ్‌లింగంపల్లిలోని డా. బీఆ అంబేడ్కర్ కళాశాల మూడోస్థానంలో నిలిచినట్లు కళాశాల ప్రిన్సిపల్ డా. మట్టాశేఖర్, డైరెక్టర్ విష్ణుప్రియ తెలిపారు. సోమవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. టోర్నమెంట్‌లో మొత్తంగా 15 పాయింట్స్‌తో అంబేడ్కర్ కళాశాలకు 3వ స్థానం లభించడం ఆనందంగా ఉందన్నారు. యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ ప్రొ. కుమార్, రిజిస్ట్రార్ ప్రొ.నరేష్‌రెడ్డి, ప్రొ. జితేందర్ నాయక్, ప్రొ. కిషన్, ప్రొ. ఎల్‌బీ రాథోడ్ ప్రొ. రాజేష్‌ల చేతుల మీదుగా ట్రోఫీ, సర్టిఫికెట్లను అందుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రొ. యాదగిరి, అడ్మిన్ ఆఫీసర్ కిరణ్, ఫిజికల్ డైరెక్టర్ శ్రావణ్, పాండు తదితరులు పాల్గొన్నారు.

సోదరభావంతో ఉండాలి

చిక్కడపల్లి: శాంతియుత వాతావరణంలో ప్రతి ఒక్కరూ కలిసిమెలసి దేశభక్తి, సమాజాభివృద్ధికి తోడ్పాటునందిస్తూ సోదరభావంతో కలసిమెలసి ఉండాలని చిక్కడపల్లి బ్రహ్మకుమారీస్ శాఖ **ఇన్‌చార్జి జయశ్రీ అన్నారు. సోమవారం ప్రతికా సోదరులకు స్వయంగా రాఖీ కట్టి ఆమె మిఠాయిలు తినిపించారు. ఈ సందర్భంగా జయశ్రీ మాట్లాడుతూ.. అన్నాచెల్లెళ్ల అనుబంధానికి రాఖీ పండుగ ప్రతీకని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సీనియర్ పాత్రికేయులు చిలుకూరి అఖిలేష్, గుడిగణేష్, శ్రీధర్, కనకచారి, శ్రీనివాస్, బాలకృష్ణలు, బ్రహ్మకుమారీస్ రస్మిత, విజయప్రియాలు పాల్గొన్నారు.**

ఇద్దరికి జైలు, 19మందికి జరిమానా

కవాడిగూడ: గాంధీనగర్ ట్రాఫిక్ పోలీసులు విస్తృతంగా డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. అందులో భాగంగా మద్యం మత్తులో వాహనాలు నడిపిన 21 మందిపై కేసులు నమోదు చేసి నాంపల్లి కోర్టులో హాజరు పరచారు. ఒకరికి ఆరు రోజులు, మరొకరికి 10రోజులు జైలు శిక్ష విధించారు. మరో 19 మందికి జరిమానా విధించినట్లు గాంధీనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కాచిగూడ: ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కాచిగూడ రైల్వే స్టేషన్ సమీపంలో రైల్వే క్వార్టర్స్ గోల్నాక రోడ్డులో గుర్తుతెలియని వ్యక్తి (70) మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బృందావనం.. భక్తి పరిమళం

- మధ్వారాధన వేడుకల్లో సత్యాత్మతీర్థ స్వామీజీ
- విశేష పూజల్లో భారీగా హాజరైన భక్తులు





కాచిగూడలో రాఘవేంద్రస్వామిని దర్శించుకున్న మధ్వాచార్య సత్యాత్మతీర్థ స్వామి



బర్కత్‌పురలోని మంత్రాలయ రాఘవేంద్రస్వామి మఠంలో అన్నప్రసాద వితరణలో పాల్గొన్న భక్తులు

కాచిగూడ: శ్రీ రాఘవేంద్రస్వామి 354వ ఆరాధనోత్సవాల్లో భాగంగా సోమవారం కాచిగూడ, లింగంపల్లిలోని శ్రీ రాఘవేంద్ర స్వామి బృందావన సమితిలో స్వామి వారి మధ్వారాధన కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా బృందావనంలో విశేష పూజలు జరిగాయి. ఉదయం రాఘవేంద్రుల మూల బృందావనానికి పంచామృతాభిషేకం, పుష్పాలంకరణ చేశారు. పూజా మందిరంలో రాములోరి స్థాపన పూజ చేపట్టారు. స్వామివారి బృందావనానికి భక్తుల అష్టోత్తర పారాయణం నడుమ పాలు, పంచామృతాలు, ఫలాలతో అభిషేకం చేశారు. సుప్రభాతం, అలంకరణ, హస్తోదక సేవ తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మధ్వాచార్య సత్యాత్మతీర్థ స్వామిజీ ఈ సందర్భంగా శ్రీరాఘవేంద్రస్వామికి అభిషేకం చేశారు.

నేడు రథోత్సవం

రాఘవేంద్రస్వామి ఉత్సవాల్లో ముఖ్యమైన ఉత్తర ఆరాధన సందర్భంగా బర్కత్‌పురలోని స్వామివారి మఠం వద్ద మహా రథోత్సవం మంగళవారం ఉదయం 9గంటలకు జరుగనుంది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మఠం మేనేజర్ అమరచింత అనిల్ కుమార్ కోరారు.

◆ ప్రముఖ కర్ణాటక సింగర్ అనంతరాజ్ మిస్త్రీ, డాక్టర్ శ్రీవత్స ఉపాధ్యాయ కొలేకడిచే నిర్వహించిన దాసవాణి కార్యక్రమం భక్తులందరిని ఎంతగానో ఆకట్టుకుంది. కార్యక్రమంలో శ్రీ రాఘవేంద్ర స్వామి బృందావన సమితి కార్యదర్శి బి.పి.రాఘవేంద్ర రావు, మేనేజర్ నరసింహాచార్ కండ్లూర్, ఎం.క్రిష్ణమూర్తి, ఎంఆర్ అనంతమూర్తి ఆచార్య, బి.హరిరావు, కేఆర్. ప్రహ్లాదరావు, హెచ్.రాఘవేంద్ర, టి.గురురాజ్‌రావు, బీకే పవన్, కె.వెంకటేష్ తదితరులతో పాటు మధ్వ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మంత్రాలయ శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో..

◆ మంత్రాలయ శ్రీరాఘవేంద్రస్వామి మఠంలో భక్తుల జయజయధ్వానాల మధ్య మధ్వారాధన వేడుకలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. బర్కత్‌పురలోని స్వామివారి బృందావనానికి 500 లీటర్ల పాలు, పెరుగు, పండ్లు, తేనే, నెయ్యితో అభిషేకం చేశారు. ఈ సందర్భంగా స్వామివారికి నిర్మల్య విసర్జనం, అష్టోత్తర పారాయణం, పాదపూజ, విశేష పంచామృతం, తులసి అర్చన, అలంకార, హస్తోదక, మహా మంగళహారతి, తీర్థ ప్రసాద వితరణ జరిగింది.

◆ శ్రీమఠం పుష్పాలంకరణతో నిండిపోయింది. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. రాఘవేంద్రస్వామి దర్శనం కోసం బారులు తీరారు. భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో మఠం మేనేజర్ అమరచింత అనిల్‌కుమార్, వేద పండితులు, అర్చకులు పాల్గొని స్వామివారి పూజలను ఘనంగా నిర్వహించారు. సాయంత్రం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడికి ఆశీర్వాదం



కాచిగూడ: మధ్వాచార్య సత్యాత్మ తీర్థస్వామి కాచిగూడలోని ఉత్తరాది మఠంలో చాతుర్మాస్య దీక్ష తీసుకుంటున్నారు. సోమవారం రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రాంచందర్‌రావు స్వామిజీని కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. కాచిగూడ కార్పొరేటర్ ఉమారాణి, నాయకులు రమేష్‌యాదవ్, చంద్రశేఖర్, అభయ్ పాటిల్, సుభాష్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కాలేరు ప్రత్యేక పూజలు

కాచిగూడ: శ్రీరాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాల్లో భాగంగా సోమవారం లింగంపల్లిలోని బృందావన సమితిలో సోమవారం మధ్వారాధన పూజలు జరిగాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కాలేరు పద్మ ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రతినిధులు ఎమ్మెల్యేను సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు ఎర్ర భీష్మదేవ్, దాత్రిక్ నాగేందర్ బాబ్జీ, బబ్లూ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కాలేరుకు సన్మానం



తెలంగాణ ఉద్యమకారులకు అన్యాయం



సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ చంద్రకుమార్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ రాష్ట్రంలో ఉద్యమకారులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి. చంద్రకుమార్ అన్నారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ఉద్యమకారుల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చంద్రకుమార్ మాట్లాడుతూ... ఏ ఆశయం కోసం ఉద్యమం చేశామో.. ఆ ఆశయం నెరవేరకపోవడం బాధాకరమని అన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం చేసిన ఉద్యమ ఆశయం నీరుగారిపోతోందని అన్నారు. తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి వారి కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాశం యాదగిరి, రామగిరి ప్రకాష్, నాగేష్ పటేల్, కంచెర్ల బద్రి, ప్రొఫెసర్ నలమాస స్వామి తదితరులు పాల్గొన్నారు. అనంతరం జస్టిస్ చంద్రకుమార్ చైర్మన్‌గా సమన్వయ కమిటీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

కళాకారులను ప్రోత్సహించాలి

చిక్కడపల్లి: కళా సంస్థలు వర్ధమాన కళాకారులను ప్రోత్సహించాలని వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు అన్నారు. సోమవారం త్యాగరాయ గానసభలో రాధారాణి ఆర్ట్స్ మ్యూజికల్స్ నూతన సంస్థను ప్రముఖ గాయకుడు సీహెచ్ త్రినాథరావుతో కలసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ లోగోను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. తొలుత 'అమ్మ అన్నది ఒక కమ్మని మాట'శీర్షికతో నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించింది. ఈ కార్యక్రమంలో ప్రముఖులు రఘురాం, గోపికృష్ణ, కమలాశాస్త్రి, రాధారాణి, అమంత, లలిత, రామకృష్ణ, మధురవీణ, సుధామయి తదితరులు పాల్గొన్నారు.



ఛే-నంబర్ చౌరస్తా.. నీరు నిల్వకుండా చేస్తా!

- ఇంజినీరింగ్ లోపాలతోనే నగం వర్షపునీటి సమస్యలు
- నాలా ఆధునీకరణకు హైడ్రా సహకారం తీసుకుంటా
- శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటా
- అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట: వర్షకాలంలో తలెత్తె సమస్యలు, ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అధికార యంత్రంగానికి సూచించారు. ఈ సందర్భంగా ఇక్కడి నాలాతో ఏళ్ల తరబడి పరిసర ప్రాంతాల కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారని, దీనిని శాశ్వతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని అన్నారు. బాగ్‌అంబర్‌పేట నందనవనంకాలనీ సమీపంలో ఉన్న నాలా ప్రహరీ కూలడంతో ఆయన స్థానిక కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డితో కలిసి సోమవారం సందర్శించారు. వైభవ్‌నగర్, శారదనగర్, నందనవనం కాలనీ, బతుకమ్మకుంట, శ్రీనివాసకాలనీ, మీదుగా ఛే నంబరు చౌరస్తా, గోల్నాక నుంచి మూసీనదిలో కలుస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ప్రతి వర్షకాలంలో వర్షపునీటితో ఇబ్బందులు తెలెత్తడంతో కొంత మేర నాలా విస్తరణ జరిగిందన్నారు. మరింత అభివృద్ధి చేసేందుకు తక్షణమే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆయన సూచించారు.

నాలాల్లో వర్షపునీరు సాఫీగా వెళ్లేలా చూడండి..

◆ అవసరమైతే హైడ్రా దృష్టికి తీసుకువెళ్లి ఇక్కడి నాలా అభివృద్ధికి చొరవ తీసుకుంటానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రూ.5కోట్ల నిధుల మంజూరుకు తాను కృషి చేస్తానని తెలిపారు. చిన్నపాటి వర్షాలకు నీరు రోడ్లపైకి రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే నాలాల్లో వర్షపునీరు సాఫీగా వెళ్లడానికి ఎలాంటి అడ్డంకులు లేకుండా చూడాలని అధికారులకు ఆదేశించారు. అభివృద్ధి పనుల విషయంలో అధికారులు వెనుకాముందు ఆలోచించాల్సిన అవసరం లేదన్నారు. ఆయన వెంట జీహెచ్ఎంసీ అధికారులతో పాటు బీఆర్ఎస్ నాయకులు బీ.వెంకట్‌రెడ్డి, చందు, శ్రీరాములు ముదిరాజ్, శ్రీనివాస్, రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వర్క్‌ఇన్‌స్పెక్టర్ తీరుపై అసహనం...

◆ నాలా, వర్షపునీరు వంటి ప్రధాన సమస్యలపై క్షేత్రస్థాయిలో ఎమ్మెల్యే అధికారులతో చర్చిస్తుంటే సంబంధిత వర్క్‌ఇన్‌స్పెక్టర్ దూరంగా కబుర్లతో మునిగిపోవడంతో ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు. సాంకేతికంగా సమస్యపై చర్చిస్తుంటే అంటిముట్టనట్టుగా దూరంగా ఉంటే ఎలా అంటూ వర్క్‌ఇన్‌స్పెక్టర్ రవిని సున్నితంగా మందలించారు. క్షేత్రస్థాయిలో సమస్య తీవ్రతను గుర్తించాల్సింది పోయి నిర్లక్ష్యంగా ఉంటే ఎలా అంటూ అసహనం వ్యక్తం చేశారు.



బాగ్‌అంబర్‌పేటలో కూలిన నాలాను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి

డ్రగ్స్‌ను నిర్మూలించే బాధ్యత ప్రభుత్వాలదే..

ముషీరాబాద్: డ్రగ్స్, గంజాయి, ఇతర మత్తు పదార్థాలు యువత శరీరక, మానసిక, ఆరోగ్యాన్ని నిర్వీర్యం చేస్తాయని... వీటిని నిర్మూలించే బాధ్యత ప్రభుత్వాలదేనని మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య అన్నారు. ఆర్‌టీసీ క్రాస్ రోడ్స్‌లోని ప్రగతిశీల యువజన సంఘం(పీవైఎల్) రాష్ట్ర కార్యాలయం నుంచి మార్క్స్ భవన్ వరకు మత్తుపదార్థాలకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. చేపట్టారు. ముందుగా బైక్ ర్యాలీని మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య జెండా ఊపి ప్రారంభించారు. విద్యానగర్ నుంచి ప్రారంభమైన ర్యాలీ రాంనగర్ గుండు, వీఎస్‌టీ, అశోక్‌నగర్‌ల మీదుగా ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ వరకు కొనసాగింది. గంజాయి, డ్రగ్స్ మత్తుపదార్థాలను నిర్మూలించడం పూర్తిగా ప్రభుత్వాల బాధ్యతేనని అన్నారు. యువత మత్తుపదార్థాలకు బానిస కావొద్దని.. గంజాయి, డ్రగ్స్ మాఫియాను అరికట్టాలని నినాదాలిస్తూ ముందుకు సాగారు. ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో గంజాయి, డ్రగ్స్‌ల దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవికుమార్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్ష, కార్యదర్శులు బీఎస్ కృష్ణ, కొల్లూరు భీమేష్, కిరణ్, బంగారి శ్రీనివాస్, బాలు, శంకర్, సురేష్, నరేందర్, అంజి, రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య

పండుగలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలి

కాచిగూడ: వినాయక చవితి, మిలాద్-ఉన్-నబీ పండుగల సందర్భంగా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు జరిగేలా చూడాలని సెంట్రల్ పీస్ కమిటీ ఈస్ట్ జోన్ అధ్యక్షుడు నారాయణరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.శరత్‌శ్యామ్ కోరారు. ఈ సందర్భంగా ల్తాన్‌బజార్ ఏసీపీ ఎం.మట్టయ్యను కలిసి వినతి పత్రం అందజేశారు. ముఖ్యంగా నారాయణగూడ, కాచిగూడ లింగంపల్లి, కుద్బిగూడ, రాజ్‌మొహల్లా తదితర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు పనిచేయడం లేదన్నారు. వాటిని సరిచేసి పనిచేసేలా చూడాలని కోరారు. ప్రజలు భక్తిశ్రద్ధలతో పండుగలను నిర్వహించుకోవాలని ఏసీపీ కోరారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ పీస్ కమిటీ ప్రతినిధులు మధుసూదన్ సోమాని, యూనుస్, అడ్వకేట్ సత్యనారాయణ, బసంతి కౌర్, శ్రీలత, వంజరి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



సుల్తాన్‌బజార్ ఏసీపీ మట్టయ్యకు వినతిపత్రం ఇస్తున్న సెంట్రల్ పీస్ కమిటీ ఈస్ట్‌జోన్ ప్రతినిధులు

నులిపేద్దాం..!

- వాడవాడలా జాతీయ నులిపురుగుల నివారణదినం
- పాల్గొన్న ప్రజాప్రతినిధులు, వైద్య సిబ్బంది



విద్యార్థులకు నులిపురుగుల నివారణ మందును అందిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట: పాఠశాల స్థాయిలోనే విద్యార్థుల జబ్బులను గుర్తించాలని ఆయన ఉపాధ్యాయులకు సూచించారు. సోమవారం బాగ్‌అంబర్‌పేటలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మందులను అందించే కార్యక్రమంలో జరిగింది. ఈ కార్యక్రమానికి స్థానిక కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే హాజరయ్యారు. విద్యార్థులకు మందులను అందించి ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలన్నారు. విద్యార్థులకు విద్యతో పాటు వారి శరీరక, మానసిక ఆరోగ్యంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో...

కాచిగూడ: జాతీయ నులిపురుగుల నివారణదినం సందర్భంగా సోమవారం కాచిగూడలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను వైద్య సిబ్బంది అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, సీనియర్ లెక్చరర్స్ గీతాబాయి, వి.ప్రసాద్‌రావు, రజినీ, ఫిజికల్ డైరెక్టర్ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

నులి పురుగులు రక్త హీనతకు దారితీస్తాయి

నల్లకుంట: నులి పురుగులు చిన్నారుల్లో రక్తహీనతకు దారితీస్తాయని నల్లకుంట కార్పొరేటర్ అమృత చెప్పారు. ఇది శారీరక మానసిక ఎదుగుదలకు ఆటంకంగా మారుతాయని అన్నారు. సోమవారం నల్లకుంట డివిజన్ పరిధిలోని గోల్నాక మార్కెట్ సమీపంలోని ముంతాజ్ హై స్కూల్‌లో నిర్వహించిన జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమానికి హాజరైన కార్పొరేటర్ చిన్నారులకు నులిపురుగుల మందు వేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. అనేక రకాల అనారోగ్యాలకు కారణమవుతున్న నులి పురుగులను కేవలం ఒకే మాత్ర అల్బెండజోల్‌తో నివారించవచ్చునని తెలిపారు. ఏడాది నుంచి 19 ఏళ్ల లోపు పిల్లల్లో నులి పురుగుల సమస్య ఎక్కువగా ఉంటుందన్నారు.

◆ అపరిశుభ్రత వల్లే నులి పురుగులు ఎక్కువగా వ్యాపిస్తాయని చెప్పారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించని పిల్లలకు నులిపురుగుల సమస్య ఎక్కువగా ఉంటుందన్నారు. తల్లిదండ్రులు విధిగా తమ పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు వేయించాలని సూచించారు. బహిరంగ ప్రదేశాలలో మల, మూత్ర విసర్జన చేయకూడదని సూచించారు. మల విసర్జన తరువాత, భోజనానికి ముందు తప్పనిసరిగా సబ్బుతో చేతులు శుభ్రం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ కేజే. బాబు, నాయకుడు ధర్మేందర్, బీజేవైఎం అధ్యక్షుడు సుమన్, ఉపాధ్యాయులు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటించాలి..

ముషీరాబాద్: పిల్లలు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండేందుకు సంవత్సరం నుంచి 19 ఏళ్ల వయస్సు గల పిల్లలకు నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు వేయాలని ముషీరాబాద్ యూపీహెచ్‌సీ వైద్యాధికారి డా. మనోజ్‌రెడ్డి అన్నారు. సోమవారం జాతీయ నులిపురుగుల నులిపురుగుల నివారణదినం పురస్కరించుకుని ముషీరాబాద్ యూపీహెచ్‌సీలో చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. ఆయన మాట్లాడుతూ.. పిల్లలు పౌష్టికాహార లోపం, రక్తహీనతల వల్ల నీరసంగా ఉంటారని పేర్కొన్నారు. శారీరక, మానసిక అభివృద్ధిలో మందకొడిగా ఉంటారని పేర్కొన్నారు. పిల్లలు ఆరోగ్యవంతులుగా ఉండేందుకు పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత, స్వచ్ఛమైన నీరు, పండ్లు, కూరగాయలు తీసుకోవాలని సూచించారు. స్కూల్స్, కాలేజీలు, ప్రధాన కూడళ్లలో చిన్నారులను గుర్తించి మాత్రలు వేస్తున్నామన్నారు.

నులిపురుగులు తీవ్ర ప్రమాదం చూపుతాయి..

కాచిగూడ: ఇందిరానగర్ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అల్బెండజోల్ మాత్రలను కాచిగూడ కార్పొరేటర్ ఉమారాణి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... చిన్నారుల ఆరోగ్యంపై నులిపురుగులు తీవ్ర ప్రమాదం చూపుతాయని అన్నారు. వాటి బారి నుంచి కాపాడేందుకు తల్లిదండ్రులు చిన్నారులకు డీవార్మింగ్ మాత్రలు వేయించాలని సూచించారు. అంగన్‌వాడీ టీచర్ ఇందిర, శోభ, సబిత, బీజేపీ నేతలు రమేష్‌యాదవ్, మల్లికార్జున్, బి.భీమ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగులతో పిల్లల్లో రక్తహీనత...

చిక్కడపల్లి: నులిపురుగుల నిర్మూలనతో చిన్నారుల్లో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని జవహర్‌నగర్ ప్రభుత్వ ప్రాథమిక ఇంగ్లిష్ మీడియం పాఠశాల ప్రధానోపాధ్యాయులు మేడే దేవదాసు అన్నారు. సోమవారం జవహర్‌నగర్ పాఠశాలలో టీబీఆర్ మిల్స్ యూపీఎస్సీ, కోఠి ఆస్పత్రి వైద్యులు వసంత, జ్యోతినాయుడు, దుర్గ, భవాని, సిబ్బంది మేరిబా, శోభ, పద్మ, సునీత, ప్రవళ్లిక విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. ఈ సందర్భంగా మేడే దేవదాసు మాట్లాడుతూ... నులిపురుగుల కారణంగా పిల్లల్లో రక్తహీనత ఏర్పడుతుందన్నారు. దీని వల్ల ఆకలి మందగించడం, తలనొప్పి, కడుపునొప్పి, తొందరగా నిరసించిపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయని అన్నారు. భోజనం చేసే ముందు చేతులను శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కాచిగూడ కాలేజీలో ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది



ఓ విద్యార్థినికి నులిపురుగుల మందు వేస్తున్న కార్పొరేటర్ అమృత



చిన్నారులకు మాత్రలు వేస్తున్న డా. మనోజ్‌రెడ్డి, ఇందిరానగర్‌లో కార్పొరేటర్ ఉమారాణి



జవహర్‌నగర్‌లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రధానోపాధ్యాయులు మేడే దేవదాసు, వైద్యులు